# మెత్తని చెప్పుదెబ్బ!

నాగేశ్వర్రావ్, 'నోట్లో నాలిక లేని వాడు!' అది వుండేచోటు భుజం కష్టుక! అదే అతగాడి ప్రత్యేకత.

'నాగులుగాడి కదో జబ్బు!...' ఆఫీసులో తన యీడువాళ్లంటూంటారు.

'అయ స్సదోరకం తత్వం!'... వయసుమీద గౌరవంకొద్దీ అతగాడికంటె కొంచెం చిన్నవాళ్ళనే ముక్కలు.

'నాగేశ్వర్రావుగారు చాలా యింట రెస్టింగ్ పెర్సన్!'... ఆఫీసులో నిన్న కాక మొన్న చేరిన కుర్రకా రనుకునే మాటలు.

మొత్తంమీద నాగేశ్వర్రా వంటే అందరికీ తలో అభిప్రాయవూ( వున్న మాట నిజం.

నలభైకీ — నలభైఆయిదుకీ మధ్య నుంటాడు నాగేశ్వర్రావ్. పండిపోయిన తల. పీక్కుపోయిన మొహం. ఎండి పోయిన ఎముకలగూడు. చూట్టానికి పీనుగులా వుంటాడు. అయితే నేం, ఏనుగు కున్నంత శక్తీ, గాడిద కున్నంత ఓపికావున్నాయ్, నాలిక భుజాన వేసుకుని వూరేగటానికి!

అదృష్టం బాగుండో, ఖర్మం కాలో గాని...రెండేరెండు మార్కు లెక్కువ వచ్చి నాగేశ్వర్రావ్, ఎమ్మే—థర్డ్ క్లాస్! భావాలూ, బుద్ధులూ మరేక్లాసో తెలియదు!

అతగాడు నోరు విప్పితేచాలు, 'ఒరే నాగులూ! వెథవ్వాగుడు వాక్క వెళ్ళ నాయనా. నీకు పుణ్యం వుంటుందీ!'... యీడువాళ్ళంతా యీసడించుకోవటవే(.

వినీ విననట్లూ, అంటీ అంటనట్లూ వుంటారు మధ్యతరగతివాళ్ళు మన కెందుకులే, పోనీ, పెద్దవా డని

యిహ మిగిలినవాళ్ళల్లా మూడోరకం కుర్రకారే, మూడోతరగతి ఎమ్మేగారికి తాళం వెయ్యటానికి, తందాన పాట్టానికి.

డిస్పాచింగ్ క్లార్కు కుమారిరాజ్యం మీద గబ్బు లేపింది. నాగేశ్వర్రావ్ కాదూ?

గంపెడు సంసారాన్ని గట్టెక్కించకుండానే, తండ్రి గుటుక్కుమంటే....

అవసరాల నారాయణరావ్

యిద్దరు చెల్లెళ్ళు, ముగ్గురు తమ్ముళ్ళు. తనూ, తల్లీ, యింతమందికీ గడిచే విధానం లేక, యల్లయిసీ ఆఫీసులో క్లార్క్‌గా చేరింది. అశుభం, శుభం తెలియని అమాయకురాలు రాజ్యం.

రాజ్యం ఆఫీసులో అడుగుపెట్టి ఆర్నెల్లయిందో లేదో, ఆమెనూ, ఆఫీసర్ భాస్కర్రావుమూ కలిపి, యిద్దర్నీ తన నాలుకతో మెలిపెట్టి చుట్టి, వీధిలోకి లాక్కెళ్లింది పీనుగులాంటి నాగేశ్వర్రావే.

ఆఫీసుల్లో పని చేసే ఏ ఆడదానికి నిజాయితీ వుండేడిసింది? నీతి నియమాలు తగలడ్డాయ్? తల అమ్ముకున్నాక శీలం ఆగివస్తుందా? మగాళ్ళమందలో పడి మసుల్తోంటే... ఏవిటో పిచ్చిమాట కాకపోతే?...' అని లెక్చర్లు దంచి, ఆఫీసులో వున్న నూనూగు మీసాల కుర్రాళ్ళ నందర్నీ రెచ్చగొట్టి, ఆమెమీది కుసికొల్పింది యీ పీక్కుపోయిన మొహంకాదూ?

స్వింగ్‌డోర్ కిర్రుమంది.

హాల్లో స్టాఫంతా ఆఫీసరు గదివైపు చూశారు.

గదిలోంచి వస్తోన్నది గంభీరమైన మూర్తి! జేవురించిన మొహం! అవమానంతో అట్టుడికిపోతోన్న అభిమానవతి రాజ్యం!

హాలు నడిమధ్యలో ఒక్కసా రాగిందామె. "నాగేశ్వర్రావుగారూ! ఓసారిటొస్తారా? మీతో కొంచెం మాట్లాడవలసిన పనుంది." గంభీరంగా కన్పిస్తోన్న రాజ్యం గొంతులోంచి సౌమ్యమైన, శ్రావ్యమైన సంబోధన!

ఆశ్చర్యంతో అంతా కళ్ళప్పగించి చూస్తున్నారు ఎందుకా అని.

అక్కడంతమంది వుండగా ప్రత్యేకంగా తననే ఎందుకు పిలుస్తున్నదో అర్థం కాలేదు నాగేశ్వర్రావుకి.

అయినా సీట్లోంచి లేచి, యాంత్రికంగా వచ్చి ఆమెముందు నించున్నాడు, 'ఎందుకు పిలిచా' రన్నట్టు చూస్తూ.

"చూడండి రావుగారూ! వయసులోనూ, చదువులోనూ మీరునాకంటె అధికులు! తండ్రంతటివారు. మీకూ నాఅంత కూతు రుంది, కాని నాలా నౌకరీ చేసి కుటుంబాన్ని పోషించవలసిన గతి ఆమెకు పట్టకూడదనే నా కోరిక. కాని, ఒకవేళ అటువంటి దుర్ఘటనే దురదృష్టవశాత్తూ జరిగితే — గాడ్ ఫర్బిడ్!— సహృదయం, చిత్తశుద్ధి గల భాస్కర్రావుగారిలాంటి స్నేహితులు పెద్దన్నగారిలా అవతరించి, అండగా నిల్చి, ఆపత్సమయంలో ఆదుకుంటా రని నా నమ్మకం".

రాజ్యం — అదుక్కునయినా బ్రతుకుతాను గాని, ఆఫీసుల్లోమాత్రం పని చెయ్యకూడ దనుకున్న రాజ్యం — చరచరా వెళ్ళిపోయింది, మెట్లు దిగి.

కొయ్యబారిపోయిన ఎముకలగూడును చూసిన కళ్ళల్లో సానుభూతి మెదిలింది.